సాక్షి ప్రకాశం

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



భావి శాస్త్రవేత్తలకు సువర్ణ వేదిక

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెలాఖరులో జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన జరగనుంది. ఇందులో ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతారు. - 8లో..



డాడ్జ్ పోటీల్లో బంగారు పతకం

డాడ్జ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలికల విభాగంలో బంగారు పతకం, బాలుర విభాగంలో రజత పతకం సాధించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తొలిరోజు పెన్షన్ల పంపిణీ

- జిల్లాలో మొత్తం పెన్షన్లు 2,96,463
- పంపిణీ చేయాల్సిన మొత్తం రూ.82.42 కోట్లు



కొనకనమిట్ల మండలం చౌటపల్లిలో వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు అక్టోబర్ 1వ తేదీన ముమ్మరంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 1వ తేదీ ఆదివారం రావటం, రెండో తేదీ గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావటంతో ముందస్తుగా శనివారమే పెన్షన్‌లకు సంబంధించిన నగదును వార్డు, గ్రామ సచివాయాల సిబ్బంది డ్రా చేశారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇలా దాదాపు 17 రకాల పెన్షన్లు ప్రభుత్వం తరపున ప్రజలకు అందించాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 2,96,463 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. అందుకుగాను ప్రతి నెలా రూ.82.42 కోట్లు ఒకటో తేదీన అందించాల్సి ఉంది. తొలిరోజు 74 శాతం మందికి పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంతో పాటు పెన్షన్ల పంపిణీ జరుగుతున్న తీరును మార్కాపురం, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో ఆదివారం పర్యటించి పర్యవేక్షించారు.

నల్లమలకు పులికూనలు

నల్లమల అభయారణ్యానికి మరో మూడు పులికూనలు రానున్నాయి. తిరుపతి జూపార్కులో ఉన్న వీటిని చిన్నమంతనాల బీటు పరిధిలో వదిలిపెట్టేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 11 నెలలుగా జూ అధికారుల సంరక్షణలో ఉన్న పులిపిల్లలను వాటి సహజ సిద్ధ ఆవాసానికి తరలించేందుకు ముందుగా అడవిలో ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి వాటికి ఇతర జంతువులను వేటాడే శక్తి యుక్తులు కలిగేలా చేసి ఆపై అడవిలో వదలనున్నారు.

- తిరుపతి జూ పార్క్ నుంచి పిల్లలను తరలించేందుకు రంగం సిద్ధం
- నల్లమలలోని సహజ వాతావరణంలో సంరక్షించేందుకు చర్యలు
- పరిస్థితిని అంచనా వేసేందుకు ఉన్నతాధికారుల బృందం పర్యటన
- చిన్నమంతనాల బీట్‌లోని పెద్దపెంట అనువైన ప్రాంతంగా గుర్తింపు

పెద్దదోర్నాల:

తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూ పార్క్‌లో పెరుగుతున్న పులి పిల్లలు త్వరలోనే వాటి సహజసిద్ధ వాతావరణమైన నల్లమల అభయారణ్యంలోకి అడుగిడనున్నాయి. పులి పిల్లలను నల్లమలకు తరలించేందుకు కొన్ని రోజులుగా అటవీశాఖ తీవ్రంగా కసరత్తులు ప్రారంభించింది. సుమారు ఎనిమిది నెలల కిందట నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురంలో నాలుగు ఆడపులి పిల్లలు తల్లి నుంచి విడిపోయి స్థానికులకు కనిపించిన విషయం పాఠకులకు విదితమే. ఫిబ్రవరి మొదటి వారంలో పులి పిల్లలు దొరికిన నాటి నుంచి తల్లి పులి కోసం అన్ని ప్రాంతాలను అన్వేషించిన అటవీశాఖ అధికారులు తల్లిపులి దొరకక పోవటంతో పులి పిల్లలను తిరుపతిలోని వెంకటేశ్వర జూ పార్కుకు తరలించి నాటి సంరక్షణ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి ఓ పులిపిల్ల జూ పార్కులోనే మృతి చెందింది. ఈ క్రమంలో పులి పిల్లలకు రుద్రమ్మ, హరిణి, అనంతగా నామకరణం చేశారు. క్రమేపీ అవి పెరిగి పెద్దవవుతుండటంతో వాటిని సహజ సిద్ధంగా ఉండే అటవీ ప్రాంత వాతావరణంలో వదిలి పెట్టాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు.

నల్లమలలో అనువైన ప్రాంతాల పరిశీలన

పులిపిల్లలను సంరక్షించేందుకు అవసరమైన ప్రాంతాలను అడిషనల్ పీసీసీఎఫ్ ఏకే.నాయక్, ఆంధ్రప్రదేశ్ జూ పార్కుల డైరెక్టర్ శాంతి ప్రియ పాండే, రాహుల్ పాండే లాంటి ఉన్నత స్థాయి అధికారులు మూడు రోజుల క్రితం నల్లమలలో పర్యటించి కొన్ని ప్రాంతాలను పరిశీలించి వెళ్లారు. ఇందులో భాగంగా దట్టమైన అటవీ ప్రాంతమైన చిన్న మంతనాల బీటు పరిధిలోని పెద్దపెంట ప్రాంతాన్ని అనువుగా ఉందని నిర్ధారించారు. దీంతో పెద్దపెంటలోనే పులికూనలను సంరక్షించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పెద్దపెంట ప్రాంతంలో వాతావరణం పులులు సంచరించేందుకు అనువుగా ఉండటంతో పాటు, అక్కడి శీతోష్ణస్థితి వన్యప్రాణులు జీవించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే పులుల సంరక్షణకు సంబంధించి ఎన్‌ఎస్‌టీఆర్ అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు.

పులిపిల్లల సంరక్షణకు ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లు:

నల్లమలలోని పెద్దపెంట వద్ద పెద్దపులి పిల్లల సంరక్షణకు ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. సహజంగా తల్లిని వీడిన వన్యప్రాణుల పిల్లలకు ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసి కొన్ని రోజుల పాటు వేటాడే ప్రక్రియను నేర్పిస్తారు. తరువాత వాటిని అభయారణ్యంలో వదిలి పెట్టే రీ వైల్డింగ్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. సహజంగా కొత్తపల్లిలో దొరికిన నాటికి పులిపిల్లల వయస్సు మూడు నెలలు. నాటి నుంచి నేటి వరకు 11 నెలల కాలంగా ఆ పిల్లలు వేటాడే తమ సహజసిద్ధ గుణాలను మరిచి కేవలం జూ అధికారులు అందజేసే అహారంతోనే జీవిస్తున్నాయి. అడవికి రారాజుగా పేరొందిన పులుల విషయంలో ఈ ప్రక్రియ అంత మంచిది కాదనే అభిప్రాయం సర్వత్రా వినవస్తోంది. పులి అంటేనే వన్యప్రాణులను వేటాడే స్వభావం కలిగింది. అటువంటి పెద్దపులి పిల్లలను ప్రస్తుత పరిస్థితుల్లో జూ పార్కు నుంచి తరలించి నేరుగా అభయారణ్యంలో వదిలి పెడితే అవి అడవి కుక్కలు, అడవి పందులతో పాటు స్వజాతికి చెందిన పులుల దాడిలోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అంతే కాక దొరికిన జంతువుల పిల్లలకు రీ వైల్డింగ్‌లో భాగంగా ప్రత్యేకమైన ఆహారపు అలవాట్లు నేర్పిస్తారు. ఎన్‌క్లోజర్‌లలో పెరిగే పులి పిల్లలు వ్యక్తిగతంగా 50 జంతువులను స్వంతంగా వేటాడి తినగలిగిన నాడే దాన్ని అభయారణ్యంలోకి వదిలి వేసే పరిస్థితిలు ఉంటాయి. అలా వేటాడలేక పోయిన నాడు వాటికి ఎదురు పడిన జింకల కొమ్ములు, అడివి పందుల దంతాల ధాటికి ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. దీంతో పాటు మగపులులు ఎదురుపడితే మేటింగ్‌కు ప్రయత్నిస్తాయని, అలా కాకుండా ఆడపులులు ఎదురు పడితే వీటిపై దాడికి పాల్పడే ప్రమాదం ఉందని పలువురు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అందువల్లే ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి వాటికి ఇతర జంతువులను వేటాడే శక్తి యుక్తులు కలిగేలా పులిపిల్లలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోబోతున్నారు.



ఆత్మకూరు డివిజన్‌లో దొరికిన పులి పిల్లలు (ఫైల్)

ఒకే కాన్పులో నాలుగు ఆడపులి పిల్లలు పుట్టడం అపూర్వ సంఘటన

తిరుపతి వెంకటేశ్వర జూ పార్కులో తల్లిపులి నుంచి విడిపోయి అధికారుల సంరక్షణలో పెరుగుతున్న పులి పిల్లల పుట్టుక అపురూపమైందిగా పలువురు జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు. సాధారణంగా అంతరించి పోతున్న పులుల సంతతిపై పర్యావరణ ప్రేమికుల్లో కొంత మేర ఆందోళన ఉంది. ఈ నేపథ్యంలో ఒకే కాన్పులో నాలుగు పులిపిల్లలు పుట్టడంతో పాటు, అవి తల్లి పులి నుంచి విడిపోయి బాహ్య ప్రపంచానికిలోకి రావటం ఎంతో అరుదని వారు పేర్కొంటున్నారు. దీంతో పిల్లల సంరక్షణ బాధ్యతను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఆడపులి పిల్లల వల్ల భవిష్యత్తులో మరెన్నో లాభాలు ఉన్నాయని, దీని వల్ల ఎక్కువ పులుల సంతానోత్పత్తి ప్రక్రియ కొనసాగే అవకాశం ఉందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా 'స్వచ్ఛతా హీ సేవ'

- జిల్లా వ్యాప్తంగా సామాజిక ఉద్యమంలా చేపట్టిన వైనం
- ఏక్ తారీఖ్..ఏక్ గంటా.. ఏక్ సాథ్ అన్న నినాదంతో ముందుకు
- మార్కాపురం కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్
- ఒంగోలులో పాల్గొన్న కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్



మార్కాపురంలో వీధులను శుభ్రం చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ



ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువలో వ్యర్థాలు తొలగిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. అక్టోబర్-2 జాతి పిత, మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందుకుగాను దేశ వ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు విరివిగా పాల్గొని విజయవంతం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా సెప్టెంబర్ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విరివిగా చేపట్టారు. అక్టోబర్ 1వ తేదీన 'ఏక్ తారీఖ్...ఏక్ గంటా...ఏక్ సాథ్' అన్న నినాదంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు. పరిశుభ్రతా కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంలా చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన చేపట్టారు. జిల్లా కేంద్రం మొదలుకొని మారుమూల పల్లె వరకు ఈ కార్యక్రమాన్ని ఒక అధికారిక కార్యక్రమంలా చేశారు. స్వచ్ఛభారత్ దివస్ ముఖ్య ఉద్దేశం..''చెత్త రహిత భారతదేశం''గా రూపొందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని వీధులను శుభ్రం చేశారు. మురుగు కాలువల్లో చెత్తను శుభ్రం చేశారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను పీకేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, స్వచ్ఛతా కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేదు మాధవన్, మున్సిపల్ చైర్మన్ కృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు. మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్‌తో పాటు మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ.నారాయణ రెడ్డి పంచాయతీ కార్మికులతో కలిసి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ ఒంగోలు నగరంలోని నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి నగరంలోని పోతురాజు కాలువలో చెత్తా, చెదారాలను శుభ్రం చేశారు. ప్రధానంగా విచ్చలవిడిగా కాలువలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.

■ పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం అధికారులు, సిబ్బంది బ్యాంకు ప్రాంగణం, పరిసరాలతో పాటు ఏబీఎం డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్రాంగణమంతా నిండిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు ఇతర వ్యర్థాలను సైతం శుభ్రం చేశారు. అదేవిధంగా ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాలను కూడా శుభ్రం చేశారు.

■ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు కంభం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక అధికారులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే వైద్యశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు.

■ కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కనిగిరి పట్టణంలోని ఐదో వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను పీకేశారు. చీపురు చేతపట్టి రోడ్లు శుభ్రం చేశారు. మురుగు కాలువల్లో ప్రవాహానికి అడ్డుపడిన చెత్తా చెదారాలను కూడా తొలగించారు. ఎమ్మెల్యే బుర్రాతో పాటు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, ఆర్ మాణిక్య రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

■ యర్రగొండపాలెం, దర్శి, సంతనూతలపాడు, కొండపి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టారు.

భూ ఆక్రమణలకు పాల్పడే వారిని క్షమించం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: భూ ఆక్రమణలకు పాల్పడేవారు ఎంతటి వారైనా క్షమించేదే లేదని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలో కొంతమంది భూ ఆక్రమణలకు పాల్పడుతూ దొంగ రిజిస్ట్రేషన్లు సృష్టించి బెదిరిస్తున్నారంటూ బాలినేనికి ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై బాలినేని అధికారులతో మాట్లాడి తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన తన నివాసంలో తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల పోలీసులు కొంతమందిని అరెస్టుచేశారని, వారివద్ద నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులు గుర్తించారన్నారు. గత 15 సంవత్సరాలుగా వీరు నకిలీ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. వారు ఏ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించేదిలేదని, వారి వెనుక ఉన్న వ్యక్తులను కూడా వదిలేది లేదన్నారు. ఎవరైనా తమ భూమి ఆక్రమణకు గురైందని గుర్తిస్తే వారు వెంటనే పత్రాలతో తనకు ఫిర్యాదుచేసినా లేదా జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి లేదా పోలీసుశాఖకు ఫిర్యాదు చేసినా వారి భూమి వారికి ఇప్పించేందుకు తక్షణమే చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో ఇప్పటికే ఈ విషయమై మాట్లాడామని, భూ బకాసురులను గుర్తించి పోలీసు శాఖకు అప్పగించాలని, రెవెన్యూశాఖ నుంచి బాధితులకు న్యాయం అందించాలని కోరామన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్ 17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రకాశం ప్రథమస్థానం

ఒంగోలు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదివారం తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ సత్తాచాటింది. ఈ సందర్భంగా బాలికల జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ అభినందించారు.



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు



అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఉత్సాహంగా క్రికెట్ సెలక్షన్స్

ఒంగోలు: అండర్-14 బాలుర జట్టు ఎంపిక స్థానిక మంగమూరు రోడ్డులోని ఏసీఏ మినీ లార్డ్స్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్‌తోపాటు బ్యాటింగ్ ప్రావీణ్యాన్ని కోచ్‌లు చంద్ర, బాబూరావు, చంద్రిక, శివనాగేశ్వరరావు, కేశవరెడ్డి పరిశీలించారు. అనంతరం ఎంపికైన జట్టును ఉద్దేశించి జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వీ రరాఘవరెడ్డి మాట్లాడుతూ మూలపాడులో డిసెంబర్‌లో జరిగే అండర్ 14 అంతర్ జిల్లాల పోటీల్లో విజయమే లక్ష్యంగా సాధన చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక

- జిల్లా అధ్యక్షునిగా మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరెడ్డిల నేతృత్వంలో ఈ ఎంపిక జరిగింది. వైఎస్సార్‌టీఎఫ్ నాయకులతోపాటు ఎయిడెడ్ ఉపాధ్యాయులు, 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎంఎల్‌సీ ఎన్నికల్లో వైఎస్సార్ టీఎఫ్, అనుబంధ సంఘాలు బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి గెలుపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తాజా శాసనమండలి సమావేశాల్లో మనం బలపరిచిన అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై గళం వినిపించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మనోధైర్యాన్ని కల్పించారని, త్వరలోనే సమస్యలు కూడా తప్పక పరిష్కారం అవుతాయన్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఇటీవల ఐక్యరాజ్యసమితికి సైతం వెళ్లడం మన ప్రభుత్వ ఘనతను తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నేడు కార్పొరేట్ కంటే మిన్నగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం నిలిచిందన్నారు. ట్యాబ్‌లు పంపిణీ కావొచ్చు, బైజూస్ కంటెంట్‌తోపాటు విద్యార్థులు తమ విద్యాభివృద్ధికి అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఏడాదికి రూ.15 వేలు చొప్పున జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం అందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసులు, గజ్జెల తిరుపతిరెడ్డి, తాజా మాజీ జిల్లా అధ్యక్షుడు వి.వెంకట్రామిరెడ్డి, ఎన్నికల అధికారిగా ఎం.మహంకాళేశ్వరరావు (కృష్ణా జిల్లా), 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మండవ సుబ్బారావు, వీరయ్య, ఏపీటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకరరెడ్డి, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి

నూతన కమిటీ:

జిల్లా అధ్యక్షుడిగా మట్టిగుంట మహేశ్వరరావు (వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా పర్వతం రమణారెడ్డి (ముండ్లమూరు మండలం పోలవరం), గౌరవాధ్యక్షునిగా ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (కనిగిరి), ఆర్థిక కార్యదర్శిగా ఎలిక కృష్ణప్రసాద్ (మర్రిపూడి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రపుశాల చంద్రశేఖర్ (పెద్దారవీడు), మహిళా అధ్యక్షురాలుగా ఎస్.అరుణకుమారి (ముండ్లమూరు), మహిళా కార్యదర్శిగా కె.ఆదిలక్ష్మి (కొండపి)లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



వల్లెపు వంశీ (ఫైల్)

చీమకుర్తి: చీమకుర్తి రామ్‌నగర్‌కు చెందిన వల్లెపు వంశీ (9) అదృశ్యమైనట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామిరెడ్డి వెల్లడించారు. గత నెల 29వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో వినాయకుడి విగ్రహం నిమజ్జన ఊరేగింపు కార్యక్రమానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చీమకుర్తిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంశీ 5వ తరగతి చదువుతున్నాడని, ఆచూకీ తెలిసిన వారు చీమకుర్తి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

పొన్నలూరు: భార్యపై అనుమానంతో ఇంట్లో ఉరి వేసుకుని భర్త ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ సంఘటన స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నలూరులోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దార్ల సురేష్ (41)కు నాగమణితో 16 ఏళ్ల కిత్రం వివాహమైంది. సురేష్ బేల్దారి, పెయింటింగ్ పనులు చేస్తుండగా, భార్య నాగమణి కూలి పనులకు వెళ్తుంటుంది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా, నాగమణి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త సురేష్ తరచూ గొడవ పడేవాడు. ఆమెను పుట్టింటికి పంపించడంతో ఇరు కుటుంబాల పెద్దలు సర్దిచెప్పి మళ్లీ కలిపారు. ఆదివారం కూడా వారి మధ్య గొడవ జరిగింది. ఆమె ముందే ఉరివేసుకోవడానికి సురేష్ ప్రయత్నించాడు. పిల్లలు ఇంటి పక్కవారిని పిలవడంతో వాళ్లు వచ్చి సర్దిచెప్పి వెళ్లిపోయారు. అనంతరం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నాగమణి, పిల్లలు బయటకు వెళ్లడంతో ఒంటరిగా ఉన్న సురేష్, చొక్కాతో ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాజారావు వెళ్లి పరిశీలించారు. సురేష్ ఆత్మహత్యకు నాగమణి వివాహేతర సంబంధమే కారణమని బంధువులు వాపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

టంగుటూరు: గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తూర్పునాయుడుపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు గ్రామానికి చెందిన బొడ్డు సుధాకర్, వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తుండగా తూర్పునాయుడుపాలెం వద్ద గుర్తుతెలియని కారు బలంగా ఢీకొట్టింది. సుధాకర్ తీవ్రగాయాలై శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. వెంకటేశ్వర్లుకు ఎడమ కాలు విరిగింది. క్షతగాత్రులను జాతీయ రహదారి అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

ఎమ్మెల్యే స్వామితో ఒక్క పనీ చేయించలేకపోయా..!

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ సర్పంచ్ డోలా చెన్నకేశవులు
- అతనితో పాటు పలువురి చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు



టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పలువురు చేరుతున్నట్లు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వెలగపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ డోలా చెన్నకేశవులు, మరో 10 కుటుంబాలకు చెందిన 27 మంది ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసిన వరికూటి అశోక్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ డోలా చెన్నకేశవులు మాట్లాడుతూ టీడీపీకి చెందిన కొండపి ఎమ్మెల్యే స్వామి తనకు సోదరుడవుతారని, తాను టీడీపీలో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నానని తెలిపారు. సర్పంచ్‌గా ఉన్నప్పుడు కూడా గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే స్వామి ద్వారా ఒక్క మంచి పని కూడా చేయించలేకపోయినట్లు తెలిపారు. స్వామి వల్ల తనకు పక్షవాతం కూడా వచ్చిందని భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు (చిన్నా), కొండపి ఏఎంసీ డైరెక్టర్లు టంగుటూరి రామకృష్ణ, కొమ్ము సురేంద్ర, మెండా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలకు సువర్ణ వేదిక

- చిన్ననాటి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాజెక్టుల ప్రదర్శనకు అవకాశం
- 10 నుంచి 17 సంవత్సరాల్లోపు వారు అర్హులు
- ఈ నెలాఖరున జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

ఒంగోలు: చిన్నతనం నుంచే ఏదో ఒకటి సాధించాలనే తపనున్న చిన్నారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి వారిని భావిశాస్త్రవేత్తలుగా మలర్చేందుకు జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రతి ఏటా నిర్వహిస్తున్న పోటీలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించనుండగా, ఈ నెలాఖరున జిల్లాలో జిల్లాస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన జరగనుంది. అందులో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతారు. ఎటువంటి ప్రాజెక్టులు రూపొందించాలనే దానిపై ప్రతి ఏటా ఒక నేపథ్యాన్ని విద్యార్థుల ముందు ఉంచుతారు. దానికి అనుగుణంగా ఉన్న ప్రాజెక్టులను మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

ఈ ఏడాది నేపథ్యం ఇదీ...

ఏపీ రాష్ట్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్), 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లు ఈ ఏడాది ప్రాజెక్టుల ప్రదర్శనకు సంబంధించి సామాజిక వికాసానికి దోహదపడే ఆరోగ్య, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అనే అంశాన్ని ఎంపిక చేశారు. సబ్ థీమ్‌గా ఆవరణ వ్యవస్థలపై, ఆరోగ్యంపై పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులపై పర్యావరణ వ్యవస్థ, ఆధారిత విధానంపై పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం వైవిధ్య సాంకేతిక పద్ధతులపై ప్రాజెక్టులు రూపొందించవచ్చు. వీటిని ముందుగా జిల్లాస్థాయిలో సమర్పించాలి. పూర్తి వివరాలకు ఆప్‌కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ టి.రమేష్‌ను సంప్రదించాలి.

ప్రాజెక్టు ఎలా ఉండాలంటే..?

జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే సూత్రాల నమూనాగా ఉండాలి. విద్యార్థులు ప్రదర్శించే ప్రాజెక్టులు ప్రధాన అంశానికి లేదా ఉప అంశానికి లోబడే ఉండాలి. ప్రాజెక్టు ద్వారా సమస్యకు నిర్దిష్ట కాలంలో పరిష్కారాన్ని కనుగొనలేకపోయినప్పటికీ అధ్యయన పద్ధతి మాత్రం శాస్త్రీయంగా ఉండాలి. సమస్య అవగాహన, సృజనాత్మకత, నూతనత్వానికి ప్రాధాన్యత తప్పనిసరి. ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి ప్రాజెక్టు నిర్వహించాలి. చక్కని శీర్షిక, సంబంధిత నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి. పరిశీలనలను తేదీల వారీగా లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. దత్తాంశాలన్నింటినీ విశ్లేషించాలి. పరిశోధనల ఫలితాన్ని వివరించి వ్యాఖ్యానించాలి. సమస్యకు పరిష్కారాన్ని సూచించాలి. ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో సమర్పించాలి. 250 పదాలకు మించకుండా ప్రాజెక్టు గురించి సంక్షిప్తంగా వివరించాలి.



30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విజేతలకు బహుమతులిస్తున్న మంత్రి రోజా (ఫైల్ ఫొటో)

పోటీలకు అర్హులు వీరే...

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని యాజమాన్యాల పరిధిలో 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు అర్హులు. పాఠశాలలకు వెళ్లేవారితో పాటు బడిమానేసిన వారు కూడా ఇందులో పాల్గొనవచ్చు. అయితే, ప్రాజెక్టులు ప్రదర్శించే విద్యార్థుల వయసు 10 నుంచి 17 ఏళ్లలోపు మాత్రమే ఉండాలి. జిల్లాస్థాయి ప్రదర్శనకు 10 నుంచి 17 ఏళ్లలోపు వారందరినీ ఆహ్వానిస్తారు. రాష్ట్రస్థాయిలో 10 నుంచి 14 ఏళ్లలోపు వారిని జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్లలోపు వారిని సీనియర్లుగా పరిగణిస్తారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య లక్ష్యం.

సైన్స్ టీచర్లు మార్గదర్శకత్వం వహించాలి



ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రాజెక్టులు రూపకల్పన చేయాలి. ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు సైన్స్ టీచర్లు గైడ్‌గా వ్యవహరిస్తారు. ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9666955504ను సంప్రదించవచ్చు.

– టి.రమేష్, ఆప్‌కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్

ప్రతి పాఠశాల నుంచి ప్రాతినిధ్యం ఉండాలి



జిల్లాలో ఉన్న అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ప్రాతినిధ్యం ఉండాలి. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై పాఠశాలల హెడ్మాస్టర్లు, సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

– వీఎస్ సుబ్బారావు, డీఈవో

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

- మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి సురేష్, పక్కన ఎమ్మెల్యే కేపీ, తదితరులు

మార్కాపురం: రాష్ట్రంలో మెరుగైన పారిశుధ్యానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద నుంచే తడి చెత్త, పొడి చెత్తను మున్సిపల్ కార్మికులు సేకరిస్తున్నారని చెప్పారు. పారిశుధ్య కార్మికుల డిమాండ్లను పరిశీలించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మార్కాపురం పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి రీడింగ్‌రూం సెంటర్ నుంచి అమ్మవారిశాల, తేరుబజారు, నాయుడువీధి వరకూ అన్ని వీధులను పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం నిర్వహించిన సభకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సురేష్ మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో అదనంగా 30 డస్ట్‌బిన్లు ఇస్తామన్నారు. ఇంకా క్లీన్ మార్కాపూర్, గ్రీన్ మార్కాపూర్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ వేకువజాము నుంచి రాత్రి వరకూ పారిశుధ్యం విషయంలో సేవలందిస్తున్న కార్మికులను ప్రతిఒక్కరూ గౌరవించాలని కోరారు. మార్కాపురం మున్సిపాలిటీకి 21 ఈ-ఆటోలు ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే జీతాలు పెంచారని గుర్తుచేశారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించాలని, చిన్నచూపు చూడవద్దని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజర్ కిరణ్‌కుమార్, మెప్మా పీడీ రవికుమార్, డీపీవో నారాయణరెడ్డి, కమిషనర్ గిరికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, డీ హర్షిత, కరీమ్‌బాషా, రామకృష్ణారెడ్డి, బండారు శ్రీను, సాధనా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాజగోపాల్‌రెడ్డి, రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మయూరి ఖాశీం తదితరులు పాల్గొన్నారు. కరోనా సమయంలో విశిష్ట సేవలందించిన పారిశుధ్య కార్మికులను మంత్రి సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఘనంగా సన్మానించారు. ర్యాలీకి వచ్చిన సాధనా కళాశాల విద్యార్థులు, ప్రజలు, డ్వాక్రా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు



రోడ్డుపక్కన పడిన ఆటో



ప్రమాదానికి కారణమైన కారు



కాలు విరిగిన ఆటోడ్రైవర్ వాసు



తీవ్రంగా గాయపడిన చిన్నమౌలాలి

బేస్తవారిపేట: ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటోలోని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం సమీపంలో కడప–తోకపల్లె హైవేపై ఆదివారం జరిగింది. కంభం నుంచి పడగాల వాసు (ఆటో డ్రైవర్), దూదేకుల చిన్న మౌలాలి ఆటోలో బేస్తవారిపేట వెళ్తున్నారు. బేస్తవారిపేట వెళ్తూ వెనుకగా వచ్చిన కారు.. డ్రైవర్ మద్యం మత్తు కారణంగా ఆటోను ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన మార్జిన్‌లో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ వాసు కాలు విరగ్గా, చిన్నమౌలాలి తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్నమౌలాలిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. స్థానిక ఎస్సై బీ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పోతురాజుకాలువలో చెత్త తొలగిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, తదితరులు

- కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపు



మినీ స్టేడియాన్ని శుభ్రం చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలోని పోతురాజుకాలువను పారిశుధ్య కార్మికులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆదివారం ఆయన శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు ఒక గంట పాటు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పోతురాజుకాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు మురుగును కూడా తొలగించారు. పోతురాజుకాలువ పరిశుభ్రంపై ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రంగారాయుడు చెరువు పరిసర ప్రాంతాల్లో, ముంగమూరు రోడ్డు జంక్షన్, బైపాస్ రోడ్లతో పాటు పలు కాలనీల్లో మురుగు కాలువలను కూడా శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో...

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని స్థానిక దక్షిణ బైపాస్‌లోని మినీ స్టేడియంలో నిర్వహించారు. మినీ స్టేడియం ప్రాంగణమంతా శుభ్రం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఆర్ఎం బీఎస్ మారిత్ శశిధర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యు.అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

డాడ్జ్‌బాల్ పోటీల్లో జిల్లాకు బంగారు పతకం



డాడ్జ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన బాలుర జట్టు

ఒంగోలు: డాడ్జ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. బాలికల విభాగంలో ఏకంగా ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆదివారం బాపట్ల జిల్లా చిలుమూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు జయకేతనం ఎగురవేయడంపై అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాహుల్, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మండవ గోపి, కోశాధికారి దొండపాటి రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. వీరు త్వరలో బెంగళూరులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.

మహిళ కిడ్నాప్ కలకలం

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌కు చెందిన మహిళ అదృశ్యమైంది. స్థానికురాలైన ఎస్‌కే హసీనాకు బద్వేలుకు చెందిన ఎస్‌కే కరీముల్లాతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. బద్వేలులో ఉంటున్న వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతున్నారు. దీంతో పది రోజుల క్రితం హసీనా దేవాంగనగర్ వచ్చింది. వెంటనే ఒంగోలులో ఉంటున్న అవ్వ దగ్గరకు వెళ్లింది. ఆదివారం ఆమెను తీసుకుని దేవాంగనగర్ రాగా, అప్పటికే కుమారుడ్ని తీసుకుని భర్త కరీముల్లా బద్వేలు నుంచి దేవాంగనగర్ వచ్చాడు. భార్యను ఊరికి తీసుకెళ్లే విషయంపై ఆదివారం కూడా ఇద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో భర్త కరీముల్లా కుమారుడిని తీసుకుని బద్వేలు వెళ్లాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి హసీనా కనిపించడం లేదు. ఎవరో కారులో వచ్చి తన కూతురు హసీనాను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారంటూ హసీనా తల్లి ఖాశింబీ పోలీసులకు చెప్పడంతో కలకలం రేగింది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ శివ రామకృష్ణారెడ్డి తెలిపారు.